**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

**తేది : 06 అక్టోబరు, 2022.**

**కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు చదువుతో నిమిత్తం లేకుండా అందరికీ వర్తింపజేయాలి.**

రాష్ట్ర ప్రభుత్వం పేద వధూవరులకు ఉద్దేశించిన కళ్యాణమస్తు పథకాన్ని చదువుతో నిమిత్తం లేకుండా అందరికీ వర్తింపజేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. పేద, బడుగు, బలహీన వర్గాలను పథకానికి దూరం చేసే ఈ నిబంధనలను వ్యతిరేకిస్తున్నది.

పేదల సంక్షేమం కోసం పెట్టిన ప్రతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒకదాని తరువాత ఒకటి కొత్త కొత్త నిబంధనలు చేర్చి లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నది. కళ్యాణమస్తు పథకానికి ముందు వధువు టెన్త్ పాస్ అయి ఉండాలని నిబంధన పెట్టారు. ఇప్పుడు వరుడు కూడా టెన్త్ పాస్ అయ్యి ఉండాలని నిబంధన చేర్చారు. వలస కార్మికులు, రోజు కూలీలు పిల్లలను చదివించుకునే అవకాశాలు తక్కువ. 10వ తరగతి లోపే చదువు మానేసి ఉపాధి కోసం వెళ్ళే వారి సంఖ్య పేద వర్గాల్లో ఇప్పటికీ గణనీయంగానే ఉంది. ఎస్సీ, ఎస్టీల్లోనైతే ప్రభుత్వ లెక్కల ప్రకారమే 10వ తరగతి లోపు స్కూల్ డ్రాపౌట్స్ 70 శాతం పైనే ఉంటోంది. కాబట్టి రానున్న ఐదు సంవత్సరాల్లో ఈ తరగతులకు చెందిన ప్రతి యువతీయువకుల్ని 10వ తరగతి పాస్ అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి.

ఈ దృష్ట్యా రాష్ట్రప్రభుత్వం పెడుతున్న నిబంధనలు పేద, బడుగు, బలహీన వర్గాలను పథకాలకు దూరం చేయడమే తప్ప మరొకటి కాదు. కనుక కళ్యాణమస్తు పథకానికి చేర్చిన చదువు నిబంధనను వెంటనే తొలగించి పేదలందరికీ ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఆదాయ పరిమితిని సంవత్సరానికి రు.5 లక్షలకు పెంచాలని కోరుతున్నాము.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి